క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధిగా శ్రీనివాస్



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కరీంనగర్ జిల్లాకు చెందిన వారాల శ్రీనివాస్‌ను జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నియమించారు. సోమవారం విద్యానగర్‌లో ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనేక ఏళ్లుగా బీసీహక్కుల సాధనకు ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని, భవిష్యత్తులో అదే పోరాటాన్ని కొనసాగించాలన్నారు. ఈ దిశగా పార్లమెంటులో బీసీ బిల్లు సాధించేంత వరకు ఉద్యమించాలని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గుజ్జ కృష్ణ, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

బీఆర్‌టీయూ కార్యదర్శిగా చెరుకు శ్రీనివాస్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శిగా చెరుకు శ్రీనివాస్ ఎన్నికయ్యారు ఈ మేరకు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కనీస వేతన మండలి చైర్మన్ నారాయణ, ట్రేడ్ యూనియన్ నాయకులు వేముల మారయ్య, రూప్‌సింగ్, సిలివేరు ప్రభాకర్, శివశంకర్ తదితరులు ఆయనను అభినందించారు.

నియామకం



నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కవిత నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్ మాజీ ఎంపీ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్‌కుమార్‌యాదవ్ ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు.

నేడు అక్కినేని పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: ప్రముఖ నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి సందర్భంగా ఆదర్శ దంపతులకు అభినందన అక్కినేని పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు భవాని, వసుంధరదేవి, కేవీ కృష్ణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సినీసంగీత కార్యక్రమం ఉంటుందన్నారు.

రేపు అక్కినేని శతగీతావళి

చిక్కడపల్లి: తెలంగాణ భాషా సాంస్కతిక శాఖ సౌజన్యంతో శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న రవీంద్రభారతిలో ఉదయం 9.30 నుంచి రాత్రి 10 వరకు అక్కినేని శతగీతావళి కార్యక్రమం నిర్వహించనున్నారు. బండారు సుబ్బారావు, మహ్మద్ రఫీ, యలమంచిలి జగదీష్, గాయని ఆమనిలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కినేని ఎక్సలెన్సీ టీవీ స్టార్ అవార్డులు –2023, సీల్‌వెల్–శ్రుతిలయ పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సినీనటులు మురళీమోహన్ అతిథులుగా పాల్గొననున్నారు.

28న 'జ్యోతిష్యం శాస్త్రమే' అంశంపై ప్రసంగం

చిక్కడపల్లి: జ్యోతిష్యం శాస్త్రమే అనే అంశంపై ప్రముఖ జ్యోతిష్య పండితులు డాక్టర్ పోలిశెట్టి రామమోహన్ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై ప్రసంగిస్తారని మోహన్ ట్రస్ట్ నిర్వాహకుడు మోహన్‌గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం జరిగే ఈ కార్యక్రమం అనురాధ, రేవతి, శ్రీదేవిల గాన లహరి తో ప్రముఖ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మ ణ్యం, ఘంటసాలకు నివాళిగా ఉంటుందన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్‌చారి తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్, శివరాంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (20) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్య సదుపాయాలు



మాట్లాడుతున్న టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

నల్లకుంట: ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుందని టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. మూడంచెలుగా ఉన్న ఆరోగ్య శాఖను ఐదెంచెలుగా మార్చిన ఘనత మంత్రి హరీష్‌రావుదేనన్నారు. పల్లె దవాఖానాలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.

- తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆడిటోరియంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఫార్మసిస్టుల సమస్యలను ప్రభుత్వం, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. తానని తెలిపారు. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టులు అందించిన సేవలు మరువలేని, మిమ్మల్ని ప్రభుత్వం కాపాడుకుంటుందని అన్నారు. ఫార్మసిస్టులకు ప్రజలకు సేవ చేసుకునే అవకాశం మనకు వచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల సంఖ్య పెరిగిన సందర్భంలో ఫార్మసిస్టు ఉద్యోగాల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం ఉండేది కాదని, నేడు వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర వైద్య సిబ్బంది అహర్నిశలు చేస్తున్న కృషి వల్ల ప్రభుత్వ దవాఖానాలపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం ఏర్పడిందన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఫార్మసిస్టులు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందే రోగికి రూ.42 ఉన్న డైట్‌చార్జీని రూ. 100కు పెంచామన్నారు. రోగితో పాటు రోగి అటెండర్‌కు కూడా ఆహారం అందిస్తున్నామని తెలిపారు.
- రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా మందుల కొరత లేకుండా సీఎం కేసీఆర్ ఆదేశాలు, ఆరోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు వివిధ వ్యాధులకు సంబంధించిన సుమారు 824 ఔషదాలను అందుబాటులో ఉంచామన్నారు.
- ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో అన్ని ఆసుపత్రుల్లోనూ ఈ ఔషదిని(డాటా ఎంట్రీ) అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఏదైనా డ్రగ్స్ స్టోర్స్, ఆసుపత్రుల్లో సాంకేతిక కారణాల వల్ల ఈ ఔషది ఆన్‌లైన్ చేయకుంటే వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు.
- ఫార్మసీస్టోర్స్‌లో అవసరం మేరకే గడువు ఉన్న మందులనే అందుబాటులో ఉంచి పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించడంలో ఫార్మసిస్టులు కృషి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు అందించే మందుల గడువు ముగిసి ప్రభుత్వం, ప్రజలపై ఆర్థికభారం పడకుండా అవసరం మేరకు మాత్రమే మందుల కోసం ఇండెంట్ పెట్టుకోవాలన్నారు.
- మందులు ఎక్స్‌పైరీ డేట్ ముగిసి మందులు వృధా కాకుండా తేదీ ముగిసేలేపే ప్రజలకు ఉపయోగపడేలా చూసుకునే భాధ్యత ఫార్మసిస్టులపై ఉందన్నారు. టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సుదర్శన్ గౌడ్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ రామకిషన్, ప్రభుత్వ వైద్యుల జాక్ అధ్యక్షుడు కత్తి జనార్దన్, కార్యదర్శి డాక్టర్ పూర్ణచందర్, టీజీపీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జాలిగామ అశోక్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్‌బ్రూస్, నాయకులు లావణ్య, పద్మజ తదితరులున్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులపై ఫిర్యాదు

ముషీరాబాద్: నియోజకవర్గంలో కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వెరిఫికేషన్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రీయానవీన్‌గౌడ్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టికి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాల వెరిఫికేషన్ నిజాయితీగా జరగలేదని, సంబంధిత శాఖ అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఇలాంటి తప్పులు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, డివిజన్ బీజేపీ నాయకులు వెంకటేష్, ప్రసాద్, లక్ష్మణ్ తదితరులున్నారు.

దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

అంబర్‌పేట: విలువలతో కూడిన నేత పండిట్ దీన్ దయాళ్ అని, ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలను పార్టీ నిర్వహిస్తోందన్నారు. విద్యార్థి దశ నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు ఆకర్షితులై అప్పటి ఆర్‌ఎస్ఎస్ ఫౌండర్ హెగ్డేవార్‌తో కలిసి సంఘ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ప్రచారక్‌గా పనిచేస్తూ 1951లో శ్యామ్‌ప్రసాద్ జనసంఘ్‌తో కలిసి ఆర్ఎస్ఎస్‌లో కీలక వ్యక్తిగా వ్యవహరించారన్నారు. కార్యదీక్ష, పనిలో ఉండే ఉత్సాహాన్ని చూసి శ్యామ్ ప్రసాద్ ముఖర్జి పండిత్ దీన్‌దయాళ్ లాంటి ఇద్దరు వ్యక్తులు ఉంటే భారతదేశ రాజకీయ ముఖ స్వరుపాన్ని మార్చవచ్చని అన్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. జన సంఘ్‌కు ఆయన చేసిన సేవలు అమోఘమైనవని, మరువలేనివని కొనియాడారు. బీజేపీ నేతలు కృష్ణాగౌడ్, కేశబోయిన శ్రీధర్, నీరజ, సంధ్యా, విశాలాక్షి తదితరులున్నారు.

ఎంటమాలజీ సూపర్‌వైజర్లపై విచారణ చేపట్టాలి

ముషీరాబాద్: నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ ఔట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్లపై విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌తో విచారణ జరిపించాలని బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమీషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాంనగర్ డివిజన్‌లోని హరినగర్, రిసాల, అంబేడ్కర్‌నగర్, తదితర ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్న అనేక ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని గత 6 నెలలుగా విజ్ఞప్తి చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి తోడు ఫాగింగ్ చేసే సమయంలో ఉపయోగించే డిజిల్, పెట్రోల్, మెథిలిన్‌లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని సీనియర్ ఎంటమాలజీస్టుకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్, గోడౌన్స్, సూపర్ మార్కెట్స్, హోటళ్లలో ఫాగింగ్ చేస్తూ.. వ్యక్తిగత లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. ఫిర్యాదు కాపీని మంత్రి కేటీఆర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, జోనల్ కమిషనర్ చీఫ్ ఎంటమాలజీస్టుకు పంపుతున్నామని వివరించారు.

వినతిపత్రం అందజేత

ముషీరాబాద్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి హరీష్‌రావుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా వినతిపత్రం అందజేశారు. సోమవారం నగరంలో మంత్రి హరీష్‌రావును కలిసి ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, వారిని ఆదుకునేందుకు ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానన్నారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి నారాయణ, నాయకులు శ్రీనివాస్, రవి, నాగరాజు, మెట్టయ్య, సత్యనారాయణ, సంతోష్, బిక్షపతి తదితరులున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్న యూత్ కాంగ్రెస్

అంబర్‌పేట: నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమడుతుందని యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షులు మొతే రోహిత్ ఆరోపించారు. సోమవారం అంబర్‌పేటలో మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ని అడ్డుకుని నిరసన తెలిపారు. ముసారంబాగ్ బ్రిడ్జ్ శంకుస్థాపనకు హాజరైన మంత్రి కేటీఆర్‌ను రోహిత్ తన అనుచరులతో ఆకస్మాత్తుగా కాన్వాయ్‌కి అడ్డుగా వచ్చి ఆందోళన చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ముషీరాబాద్: ప్రగతిశీల యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని విద్యానగర్ మార్క్స్‌భవన్‌లో జరిగిన మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.రవికుమార్, కార్యదర్శిగా భూషణవేణికృష్ణ, ఉపాధ్యక్షులుగా కిరణ్, మల్లేష్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్, ఎల్లప్ప, కోశాధికారిగా బీమేష్‌లతో పాటు మరో 6 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

చిక్కడపల్లి: వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్ మండపాలు 167 ఉండగా.. ఇప్పటి వరకు 50 వినాయకసాగర్‌కు తరలించి నిమజ్జనం చేశారన్నారు.

బీసీబంధును సద్వినియోగం చేసుకోవాలి



అంబర్‌పేట: ప్రభుత్వం అందిస్తున్న బీసీ ఆర్థికసాయంతో బీసీలు ఆర్థికంగా ఎదగాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం అందించిన రూ.లక్షసాయం పొందిన బొంతపల్లి వెంకటేష్, సుధారాణి దంపతులు అంబర్‌పేట డివిజన్‌లో ఇస్త్రీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు లవంగం ఆంజనేయులు, మహేష్ ముదిరాజ్, స్థానిక నాయకులు రాంచందర్ గుప్తా, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎస్పీ బాలసుబ్రమణ్యం గానం ప్రపంచ ప్రసిద్ధి

చిక్కడపల్లి: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం గానగంధర్వుడు అని ప్రముఖులు కొనియాడారు. త్యాగరాయగానసభలో సోమవారం శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు రామాచారి, వినోద్‌బాబులు మాట్లాడుతూ.. బాలసుబ్రమణ్యం గా+నం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిందన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని అనేక మంది వర్ధమాన గాయకులు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారన్నారు. నిర్వాహకులు ఎస్పీ బాలు అభిమాని గొర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గాయకులు శశికళ, సురేఖమూర్తి, భరద్వాజ్, వ్యాఖ్యత తులసీరామ్ తదితరులున్నారు.

పార్టీ మారుతున్నట్లు అసత్య ప్రచారం



మాట్లాడుతున్న నల్లకుంట కార్పొరేటర్ అమృత

నల్లకుంట: తాను పార్టీ మారబోతున్నట్లు కొందరు చేస్తున్న ప్రచారం నిరాధారమైనదని బీజేపీ నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత అన్నారు. రాజకీయంగా నా ఎదుగుదలను చూసి ఓర్వలేని కొందరు తనపై అసత్య వార్తలను ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం నల్లకుంటలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. తాను బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానని, బొందిలో ప్రాణం ఉన్నంత వరకు పార్టీని వీడేదిలేదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి పాల్గొంటున్నానని, ఇంత మాత్రాన పార్టీ మారబోతున్నానని ప్రచారం చేయడం సరికాదన్నారు. దీనిపై ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హెచ్చరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్, డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, రాష్ట్ర నాయకుడు మధుయాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎంబీ.కిశోర్‌కుమార్, నగర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజేబాబు, డివిజన్ ప్రధాన కార్యదర్శులు సురేష్‌యాదవ్, మహేష్, శివ మంగి, గోపి, మధుసూదన్ తదితరులున్నారు.

మత్స్యకారులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి



కొప్పు పద్మను సన్మానిస్తున్న లెల్లల బాలకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మత్స్యకారులకు చట్టసభల్లో అవకాశాలు కల్పించాలని దీనికి ప్రతి రాజకీయపార్టీ చిత్తశుద్ధితో టికెట్లు కేటాయించాలని మత్స్యకార్మిక సమైక్య జాతీయ కార్యదర్శి లెల్లల బాలకృష్ణ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మత్స్యకార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎన్నికల్లో అధ్యక్షులుగా రెండోసారి ఘన విజయం సాధించిన కొప్పు పద్మ, డైరెక్టర్ల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మత్స్య పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమానికి ప్రతి బడ్జెట్‌లో రూ.5 వేలకోట్లు కేటాయించి ఖర్చు చేయాలని కోరారు. దీనికి అన్ని రాజకీయపార్టీలు తమ మ్యానిఫెస్టో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కొప్పు పద్మ, వైస్ చైర్మన్ బైరి వినోద్‌కుమార్, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మా, నాయకులు గాలి సత్యనారాయణ, మంగలిపల్లి శంకర్, పూస సత్యనారాయణ, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

లక్ష్మీగణపతికి బిల్వార్చన



చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్డు లక్ష్మీగణపతి దేవాలయంలో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి బిల్వార్చన కనులపండువగా నిర్వహించారు. సోమవారం బిల్వాలతో అభిషేకం, సుప్రభాతం, బిందెతీర్థం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి మూలమంత్రహవనం, ప్రత్యేకపూజలు, పల్లకీసేవ, బలిహరణ, నివేదన, హారతి, మహామంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరిగింది. ముచ్చకుర్తి ప్రభాకర్, ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, సభ్యులు రమణమూర్తి, స్వరూప, అరుణశ్రీ, ఆలయ అర్చకులు కాశీనాథశర్మ, జగన్మోహనాచార్యులు, రామాచార్యులు, బుచ్చమాచార్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

స్పష్టమైన హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తాం

గాంధీఆస్పత్రి: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గాంధీ అవుట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది చేపట్టిన విధులు బహిష్కరణ, నిరసనలు రెండవ రోజైన సోమవారం కొనసాగాయి. ఆస్పత్రి ప్రాంగణంలో బైఠాయించి ధర్నా చేపట్టిన సిబ్బందితో ఆస్పత్రి సూపరింటెండెంట్ పలుమార్లు చర్చలు జరిపారు. మొత్తం 16 డిమాండ్లతో వినతిపత్రం ఆయనకు అందించగా, తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మిగిలినవి పది రోజుల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చిన ఆయన సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరారు. స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఈనెల 26 (నేడు) వైద్యమంత్రి హరీష్‌రావును కలిసి తమ న్యాయమైన సమస్యలు, డిమాండ్లను వివరిస్తామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. చిల్డ్రన్స్ పార్కు వద్ద గుర్తు తెలియని మృతదేహం పడిఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని చుట్టు ప్రక్కల వారిని విచారించగా మృతుడు ఫుట్‌పాత్‌పై బిక్షాటన చేస్తూ.. జీవిస్తున్నాడని తేలిందన్నారు. మృతుడికి సుమారు 55 ఏళ్లు ఉంటాయని, ఎత్తు 5.7, చొక్కా లేకుండా నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వినాయకుడికి విశిష్ట పూజలు

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో వినాయకుడికి వివిధ మండపాలు, బస్తీలు, కాలనీల్లో ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు విశిష్ట పూజలు నిర్వహించారు. సోమవారం పలుచోట్ల గణపయ్యను దర్శించుకుని అన్నదానం చేశారు.



బర్కత్‌పుర భూమన్నలేన్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కుద్బిగూడలో మంత్రి తలసాని కుమారుడు సాయియాదవ్ తదితరులు



రాంనగర్ డివిజన్ జెమినీ కాలనీలో పూజల్లో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి



గణేష్‌నగర్‌లో కాసాని వీరేషముదిరాజ్



కవాడిగూడలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు



బాగ్‌లింగంపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



న్యూనల్లకుంటలో..



మయూరీలేన్‌లో డాక్టర్ ఎస్.గౌతంరావు



బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి



గోల్నాకలో కార్పొరేటర్ దూసరి లావణ్య



సంజీవయ్యనగర్ బస్తీలో కార్పొరేటర్ పావని